E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం :
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :307 గురువారం 15 అక్టోబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలప్రదర్శన!



2 లో

- అక్టోబర్ 24న హైదరాబాద్‌లో కాంగ్రెస్ భారీ సభ
- లక్ష మందితో జనసమీకరణకు టీపీసీసీ ప్రణాళిక
- ఇండియా కూటమి ఆధ్వర్యంలో బహిరంగ సభ
- సభకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హాజరు
- జాతీయ స్థాయి నేతలు, ముఖ్యమంత్రులకు ఆహ్వానం
- కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోనున్న విపక్షాలు

## విదేశీ మద్యం ధరలు పెంపు!

- 352 బ్రాండ్లపై ధరల పెంపు
- 6 శాతం వరకు పెరిగిన ధరలు
- మద్యం ప్రియులపై అదనపు భారం
- 41 బార్లకు 8,771 దరఖాస్తులు
- దరఖాస్తులతో రూ.87.71 కోట్ల ఆదాయం
- ఈ నెల 16న బార్లకు లాటరీ
- కొత్త బార్ల కోసం తీవ్ర పోటీ




**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** తెలంగాణలోని మద్యం ప్రియులకు ధరల పెంపు సెగ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లలో విక్రయిస్తున్న 352 విదేశీ బ్రాండ్ల ధరలను పెంచుతూ తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సర్క్యులర్ జారీ చేసింది. సవరించిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. వివిధ బ్రాండ్లపై దాదాపు 6 శాతం వరకు ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మద్యంపై సుంకాన్ని కేంద్రం తగ్గించిన నేపథ్యంలో రాష్ట్రంలో విదేశీ మద్యం ధరలు పెరగడం చర్చకు దారితీసింది. దిగుమతి సుంకం తగ్గింపు ప్రభావం వినియోగదారులకు నేరుగా అందుతుందని భావించిన ధరల పెంపు నిరాశ కలిగిస్తోంది. సవరించిన ధరల వల్ల మద్యం ప్రియులపై అదనపు భారం పడనుంది.

ఇదిలా ఉండగా, రాష్ట్రంలో కొత్తగా 41 బార్ల ఏర్పాటుకు ఆబ్కారీ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌కు భారీ స్పందన లభించింది. మొత్తం 8,771 దరఖాస్తులు రావడంతో ఒక్కో బార్‌కు సగటున 214 దరఖాస్తులు వచ్చినట్లయింది. ఒక్కో దరఖాస్తుకు తిరిగి చెల్లించని రుసుముగా రూ.లక్ష నిర్ణయించడంతో ప్రభుత్వ ఖజానాకు ఈ రూపంలోనే రూ.87.71 కోట్ల ఆదాయం సమకూరింది.

2 లో

## జగన్ కేసులపై కీలక నిర్ణయం!

- ఇకపై రోజువారీగా విచారణ
- నాంపల్లి కోర్టు సంచలన ఆదేశాలు
- వ్యక్తిగతంగా హాజరుకావాల్సిన నిందితులు
- దశాబ్దకాలంగా పెండింగ్‌లో కేసులు
- విచారణ వేగవంతం చేయాలని ఈడీ పిటిషన్
- సత్వర విచారణ హక్కుపై వాదనలు
- జగన్ కేసులపై పెరిగిన ఉత్కంఠ

2 లో

## ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నిధులు!

- అదనంగా రూ.72 వేల సాయం
- పీఎంఏవైతో ఇందిరమ్మ ఇళ్ల అనుసంధానం
- తెలంగాణకు 2 లక్షల ఇళ్లు
- 1.75 లక్షల ఇళ్ల వివరాల నమోదు
- మరో 25 వేల మందికి అవకాశం
- అక్టోబర్ 20లోగా ప్రక్రియ పూర్తి
- కేంద్రం నుంచి త్వరలో నిధుల విడుదల



2 లో

**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** తెలంగాణలో పేదల గృహ నిర్మాణానికి మరింత ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో చేపడుతున్న 'ఇందిరమ్మ ఇళ్ల' పథకాన్ని కేంద్ర ప్రభుత్వ 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై- రూరల్)' పోర్టల్‌తో అనుసంధానించే ప్రక్రియను హౌసింగ్ శాఖ ప్రారంభించింది. దీనిద్వారా రాష్ట్రంలోని అర్హులైన లబ్ధిదారులకు కేంద్రం నుంచి అదనంగా ఆర్థిక సహాయం అందుతుంది.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద తెలంగాణకు 2 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది.

## ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల!

- మున్సిపల్ పోలింగ్ ఈ నెల 28న
- 30న మున్సిపల్ ఫలితాలు
- 16 నుంచి నామినేషన్ల స్వీకరణ
- నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- నవంబర్ 5న ఫలితాల వెల్లడి
- మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు
- రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలు

2 లో

## రైతులకు రూ.5 వేల కరువు సాయం!

- దీపావళికి ముందే రైతుల ఖాతాల్లో నగదు జమ
- 305 తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం
- 34 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- పంట రుణాల రికవరీకి తాత్కాలిక విరామం
- విద్యుత్ బిల్లుల్లో రాయితీలు, నీటి సౌకర్యాలు
- రైతు కుటుంబాల విద్యార్థులకు ఫీజుల మాఫీ

2 లో

## ఎల్‌నినో వేళ వానల జోరు!



**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** తెలంగాణకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వర్షం హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని హెచ్చరించారు. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ దశలో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తున్నాయని.. ఈశాన్య రుతుపవనాల ప్రభావం, ఇతర వాతావరణ పరిణామాలతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు తెలంగాణ వెదర్ మ్యాన్ వెల్లడించారు. ముఖ్యంగా దక్షిణ, తూర్పు తెలంగాణతో పాటు మధ్య తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడవచ్చునని అన్నారు. మేఘావృతమైన వాతావరణం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉండగా.. వర్షాల మధ్య విరామాల్లో కొన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగవచ్చునని చెప్పారు. మిగతాది 2 లో..

- ఐదు రోజుల పాటు వర్ష సూచన
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- ఎల్‌నినో వేళ మారిన వాతావరణం
- ఉరుములు.. మెరుపులతో వానలు
- గంటకు 40 కి.మీ. వేగంతో గాలులు
- ఉత్తర తెలంగాణలో భారీ వర్ష సూచన
- దక్షిణ, తూర్పు తెలంగాణకు వాన ముప్పు
- రైతులు పంటలపై అప్రమత్తంగా ఉండాలి
- వర్షాలపై తాజా హెచ్చరికలు గమనించాలి

## రాహుల్‌కు అమిత్ షా స్ట్రాంగ్ కౌంటర్!



2 లో

**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ వైఖరిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో వరుస ఓటములకు ఇతర అంశాలను నెపం చూపుతూ కాంగ్రెస్ నిరంతరం సాకులు వెతుక్కుంటోందని ఎద్దేవా చేశారు.ఎన్నికల ఓటములపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మాని, 2029 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఎదురయ్యే భారీ ఓటమికి సిద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీకి అమిత్ షా సూచించారు.

## ఓట్ల తొలగింపుపై ఒవైసీ ఫైర్!




2 లో

**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా చేపడతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సవాల్ చేస్తూ ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## 2047 విజన్‌తో తెలంగాణ పరుగులు!

- తెలంగాణ లక్ష్యం 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- సమాఖ్య-2026 సదస్సులో సీఎం ప్రసంగం
- ఎలాన్ మస్క్‌తో పోటీపడుతున్న యువత
- టోక్యో, సింగపూర్‌లతో హైదరాబాద్ పోటీ
- పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- ప్రాంతాలవారీగా రాష్ట్ర అభివృద్ధి
- పార్టీలకు అతీతంగా దేశాభివృద్ధికి కృషి



**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమైన 'సమాఖ్య-2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యువత, పారిశ్రామికాభివృద్ధి, రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు,దేశ అభివృద్ధిపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

2 లో

## చిన్నారులకు వ్యాక్సిన్ కవచం!




2 లో

- హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై డబ్ల్యూహెచ్ఓ సిఫార్సు
- గర్భాశయ క్యాన్సర్‌కు చెక్ పెట్టేలా చర్యలు
- భారత్‌లో 80 లక్షల మందికి టీకాలు
- నాలుగు రాష్ట్రాల్లో 100 శాతం కవరేజ్
- ఏపీ, బీహార్‌లో 90 శాతానికి పైగా
- తెలంగాణలో 60 శాతం వ్యాక్సినేషన్ పూర్తి

# జగన్ కేసులపై కీలక నిర్ణయం!




**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కి సంబంధించిన సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుల్లో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇకపై ఈ కేసులను రోజువారీగా విచారించాలని హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రత్యేక సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ విచారణలో భాగంగా వైఎస్ జగన్‌తో పాటు నిందితులందరిని వ్యక్తిగతంగా విచారించనున్నారు.

అయితే, దశాబ్ద కాలంగా ఈ కేసులు డిశ్చార్జ్ పిటిషన్ల దశలోనే పెండింగ్‌లో ఉండటంతో, విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇటీవల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన సత్వర విచారణ హక్కు ప్రకారం, ఈ కేసులను రోజువారీ ప్రాతిపదికన విచారించాలని ఈడీ తన పిటిషన్‌లో గట్టిగా వాదించింది. లోతైన కుట్రలు, భారీగా ప్రజాధనం లూటీ వంటి ఆర్థిక నేరాలకు సంబంధించిన ఈ కేసులను తీవ్రంగా పరిగణించాలని సుప్రీంకోర్టు కూడా గతంలో స్పష్టం చేసినట్లుగా ఈడీ తన వాదనల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలోనే నాంపల్లి ప్రత్యేక సీబీఐ కోర్టు ఈ కేసుల విచారణను వేగవంతం చేస్తూ, జగన్‌తో పాటు సంబంధిత నిందితులందరూ విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోనుంది.

# ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నిధులు!

**మొదటి పేజీ తరువాయి**

ఇందులో భాగంగా మొత్తం నిధులను రెండు విడతల్లో నమోదు చేయనున్నారు. మొదటి దశలో ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన 1.75 లక్షల ఇళ్ల వివరాలను పీఎం ఆవాస్ యోజన అధికారిక వెబ్‌సైట్‌లో అధికారులు అప్‌లోడ్ చేస్తున్నారు. ఇక రెండో దశలో మట్టి గుడిసెలు, తాత్కాలిక నివాసాల్లో నివసిస్తున్న మరో 25 వేల మంది పేదలను గుర్తించి లబ్ధిదారులుగా చేర్చనున్నారు.

ఈ డేటా ఎంట్రీ, జియో టాగింగ్ ప్రక్రియను వేగంగా, ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయి యంత్రాంగానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. హౌసింగ్ సాంకేతిక అధికారులు ఎంపీడీవోలకు అవగాహన కల్పించగా, వారు గ్రామీణ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు యాప్ వినియోగం, లబ్ధిదారుల వివరాల నమోదుపై పూర్తిస్థాయి ట్రెయినింగ్ ఇచ్చారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని అక్టోబర్ 20వ తేదీలోగా పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.ఆన్‌లైన్ నమోదు విజయవంతంగా పూర్తయిన వెంటనే కేంద్రం నుంచి నిధులు విడుదలవుతాయి. పీఎం ఆవాస్ యోజన కింద ఒక్కో ఇంటికి కేంద్ర ప్రభుత్వం నేరుగా రూ.72 వేల సహాయం అందిస్తుంది. దీంతోపాటు స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్ల నిర్మాణానికి, అలాగే ఉపాధి హామీ పథకం (వీబీ–జీరాంజీ) ద్వారా కూడా మరికొంత మొత్తం లబ్ధిదారులకు అందుతుంది. ఈ అనుసంధానంతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణ వేగం పుంజుకోవడంతో పాటు పేదలకు పెద్ద ఎత్తున ఆర్థిక భరోసా కలగనుంది.

# 2047 విజన్‌తో తెలంగాణ పరుగులు!

**మొదటి పేజీ తరువాయి**

కొత్త తరానికి కొత్త వాణిజ్య జట్టాలపై అవగాహన కల్పించడం ఎంతైనా అవసరమని సీఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, చట్టాలను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు ఎదగడంతో పాటు సమాజానికి ఆదర్శంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఎలాన్ మస్క్‌తో పోటీపడుతున్న భారత యువత..

అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపడంలో మన దేశ యువత ఎలాన్ మస్క్‌తో పోటీ పడుతోందని సీఎం కొనియాడారు. దేశానికి 2047 చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోడీ చెబుతుంటారని, స్వాతంత్ర్య శత జయంతి ఉత్సవాల నాటికి భారత్ అగ్రస్థానంలో ఉండాలని మోడీ నిర్దేశించారని గుర్తుచేశారు. జనాభా శాతాన్ని మించి తెలంగాణ రాష్ట్రం జీడీపీకి తన వంతు వాటా అందిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

టోక్యో, సింగపూర్‌లతో పోటీగా హైదరాబాద్ అభివృద్ధి..

400 ఏళ్లుగా హైదరాబాద్‌లో కాస్మోపాలిటిన్ వాతావరణం ఉందని, అన్ని రాష్ట్రాలు, దేశాల వారిని ఆదరించే సంస్కృతి ఇక్కడ ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తాము టోక్యో, సింగపూర్ వంటి నగరాలతో పోటీ పడాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంతో హైదరాబాద్ అభివృద్ధిలో వేగం పెరిగిందని, 'క్యూర్' పరిధిలో ఉన్న పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నామని చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రధాని మోడీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 'పెరీ' పరిధిలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ, రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధిని పట్టాలెక్కించామని, పెట్టుబడుల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. 2047 కల్లా తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

కాపు సామాజికవర్గం సేవలు..

కాపు సామాజికవర్గం నుంచి ఎంతో మంది రాజకీయాల్లో, ఉన్నతాధికారులుగా ఎదిగి ఆదర్శంగా నిలిచారని, వారి విజయాలను నేటి యువతకు చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాల గురించి మాట్లాడాలని, మిగతా సమయంలో పార్టీలకు అతీతంగా దేశ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# విదేశీ మద్యం ధరలు పెంపు!

**మొదటి పేజీ తరువాయి**

ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా.. ఈ నెల 16న లాటరీ ద్వారా బార్ల నిర్వాహకులను ఎంపిక చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.




హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) ఏర్పాటుతో పాటు కొత్త మున్సిపాలిటీల ఆవిర్భావం, గ్రామాల విలీనంతో జనాభా, పట్టణ పరిధి విస్తరించిన నేపథ్యంలో కొత్త బార్లకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. క్యూర్ పరిధిలో 14 బార్లకు, ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో 27 బార్లకు నోటిఫికేషన్ ఇచ్చింది. క్యూర్ పరిధిలోనే 4,252 దరఖాస్తులు రావడం గమనార్హం. ఇక్కడ ఒక్కో బార్‌కు సగటున 303 దరఖాస్తులు వచ్చాయి.

కొన్ని ప్రాంతాల్లో పోటీ మరింత తీవ్రంగా కనిపించింది. ములుగులో ఒక బార్‌కు 376 దరఖాస్తులు, అశ్వారావుపేటలో 357, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 349, కేసముద్రంలో 331, కల్లూరులో 325 దరఖాస్తులు వచ్చాయి. మొయినాబాద్‌లో రెండు బార్లకు కలిపి 664 దరఖాస్తులు నమోదయ్యాయి. మరోవైపు.. బోధన్‌లో 19, కొడంగల్‌లో 27, పరిగిలో 36, మక్తల్‌లో 38, మద్దూరులో 58 దరఖాస్తులు రావడంతో ప్రాంతాల వారీగా పోటీలో వ్యత్యాసం కనిపించింది.

కొత్త బార్లకు ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఇప్పటికే బార్లు నిర్వహిస్తున్న కొందరు యజమానులు వ్యాపారంలో నష్టాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదనపు పన్నుల ప్రతిపాదనలతో తమపై మరింత భారం పడుతుందని పేర్కొంటూ బార్ల అసోసియేషన్ ఇటీవల ఆబ్కారీ భవన్ వద్ద నిరసన తెలిపింది. అయినప్పటికీ కొత్త బార్ల కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం ఈ వ్యాపారంలో ప్రాంతాల వారీగా ఆదాయ అవకాశాలు, పోటీ, నిర్వహణ ఖర్చులపై ఆసక్తిని పెంచింది.

# రాహుల్‌కు అమిత్ షా స్ట్రాంగ్ కౌంటర్!

**మొదటి పేజీ తరువాయి**

**బై పోల్, స్థానిక పోరులో బీజేపీ ప్రభంజనం..**

ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన పలు ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను ఈ సందర్భంగా అమిత్ షా మీడియా వేదికగా ప్రస్తావించారు. బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బోణీ కొట్టలేకపోయిందని, ఒక్క సీటు కూడా గెలవలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఇక కాంగ్రెస్ సిట్టింగ్ సీటైన నగావ్‌లో బీజేపీ అభ్యర్థి 1,42,000 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించి కాంగ్రెస్ నుంచి ఆ స్థానాన్ని కైవసం చేసుకున్నారని గుర్తు చేశారు. నందిగ్రామ్‌లో 76 శాతం ఓట్లతో, 1,22,000 పైచిలుకు ఓట్ల భారీ మెజారిటీతో బీజేపీ విజయం సాధించిందని, రెజీ నగర్‌లో టీఎంసీ నుంచి ఈ సీటును చేజిక్కించుకున్న బీజేపీ అభ్యర్థి 75 వేలకు పైగా ఓట్ల తేడాతో విజయం సాధించారని పేర్కొన్నారు. ఇక పుదుచ్చేరిలో ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షమైన ఏఐఎన్ఆర్‌సీ అభ్యర్థి 8,482 ఓట్లతో విజయం సాధించగా, కాంగ్రెస్ కేవలం 22 శాతం ఓట్లకే పరిమితమైందని సెటైర్లే వేశారు. అదేవిధంగా రాజస్థాన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించిందని తెలిపారు. 90 శాతం మున్సిపల్ కార్పొరేషన్లు, 66 శాతం మున్సిపల్ కౌన్సిళ్లు, 65 శాతం మున్సిపాలిటీలను బీజేపీ గెలుచుకుందని అమిత్ మీడియాకు తెలిపారు.

**రాహుల్ గాంధీ ఆత్మపరిశీలన చేసుకో..**

ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాదరణను, బీజేపీ విజయాలను ఇతర కారణాల వల్ల వచ్చినవిగా రాహుల్ గాంధీ కొట్టిపారేయడం సరికాదని అమిత్ షా అన్నారు. కాంగ్రెస్ గతంలో సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న ఓ ప్రధాన రాష్ట్రంలో గత 41 ఏళ్లుగా ఒక్క ఎన్నిక కూడా గెలవలేకపోవడాన్ని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా రాజ్యాంగ వ్యవస్థలపై నిందలు వేయడం మాని, కాంగ్రెస్ పార్టీ తమ వరుస ఓటములపై తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలని అమిత్ షా హితవు పలికారు.

# రైతులకు రూ.5 వేల కరువు సాయం!



**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వ సహాయం కోసం వేచి చూడకుండా అన్నదాతలకు తక్షణ ఊరట కల్పించాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి రైతుకు రూ.5,000 చొప్పున తక్షణ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఈ మొత్తాన్ని ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా దీపావళి పండుగ కంటే ముందే రైతుల బ్యాంకు ఖాతాల్లో డీబీటీ ద్వారా జమ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. సెప్టెంబర్ నెలలోనే స్వయంగా కరువు ప్రభావిత జిల్లాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించిన ముఖ్యమంత్రి, రైతన్నలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఈ సహాయక ప్యాకేజీని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 36 జిల్లాలకు గాను సుమారు 34 జిల్లాల పరిధిలోని 305 తాలూకాలను ప్రభుత్వం ఇప్పటికే కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించింది. ఇది రాష్ట్ర మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో దాదాపు 75 శాతం కావడం గమనార్హం. మరాఠ్వాడా, విదర్భ, ఉత్తర మహారాష్ట్ర, పూణె రెవెన్యూ డివిజన్లలో వర్షాభావం తీవ్రంగా ఉండగా.. ముఖ్యంగా సోలాపూర్ జిల్లాలో సాధారణ వర్షపాతంలో కేవలం 48 శాతమే నమోదు కావడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సాయం తో పాటు పంట రుణాల రికవరీని తాత్కాలికంగా పూర్తిగా నిలిపివేయడం, విద్యుత్ బిల్లుల్లో రాయితీలు, తాగు–సాగు నీటి సౌకర్యాల కల్పన మరియు రైతు కుటుంబాల్లోని విద్యార్థుల పాఠశాల ఫీజుల మాఫీ వంటి పలు సమగ్ర ఉపశమన చర్యలను సైతం ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తోంది.

# హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలప్రదర్శన!



**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా జాతీయ స్థాయిలో బలప్రదర్శనకు కాంగ్రెస్ అధిష్ఠానం రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెల 24వ తేదీన విపక్ష 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో నగరంలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. రాబోయే రాజకీయ సమీకరణాలు, ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టడమే లక్ష్యంగా సుమారు లక్ష మంది జనసమీకరణతో ఈ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) నేతలు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. సభా వేదిక ఎంపిక, రవాణా, భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే పీసీసీ ముఖ్య నేతలు, మంత్రులు ప్రత్యేక కమిటీలుగా ఏర్పడి సమన్వయం చేసుకుంటున్నారు.

ఈ ప్రతిష్టాత్మక బహిరంగ సభకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తో పాటు ఇండియా కూటమిలోని జాతీయ స్థాయి అగ్రనేతలు, ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా విపక్షాలను ఏకతాటి పైకి తెస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ నినాదంతో సాగుతున్న పోరాటంలో భాగంగా హైదరాబాద్ సభను అత్యంత కీలక మైలురాయి గా మలచాలని కూటమి నేతలు భావిస్తున్నారు. ఈ సభ ద్వారా అటు జాతీయ స్థాయి రాజకీయాలతో పాటు ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపేలా అగ్రనేతల ప్రసంగాలు ఉండనున్నాయి.

# ఓట్ల తొలగింపుపై ఒవైసీ ఫైర్!

**మొదటి పేజీ తరువాయి**

ఓటర్ల జాబితాల సవరణ జరుగుతున్న తీరును, ఆ ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలను ఈ పిటిషన్‌లో ఆయన తీవ్రంగా ఆక్షేపించారు.

సవరణ విధానంపై తీవ్ర అభ్యంతరం..

సరైన నిబంధనలు పాటించకుండా ఈసీ ఇష్టానుసారంగా పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపు ప్రక్రియ చేపడుతోందిన అసదుద్దీన్ ఒవైసీ ఫైర్ అయ్యారు. ఫారమ్–6 సమర్పించే సమయంలో మ్యాపింగ్ పేరుతో నిబంధనలు ఇబ్బందికరంగా ఉన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ ప్రతిపక్షాల తరఫున ఓవైసీ కూడా న్యాయపోరాటానికి దిగారు. అయితే, ఆన దాఖల చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో నేడు విచారణ జరగనుంది.

# చిన్నారులకు వ్యాక్సిన్ కవచం!

**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** మహిళల్లో ప్రాణాంతకంగా మారుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ నిపుణులు అత్యంత కీలకమైన సిఫార్సులు చేశారు. ఇందులో భాగంగా 4 నుంచి 8 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హ్యూమన్ పాపిలోమావైరస్ వ్యాక్సిన్ అందించాలని నిపుణుల బృందం సిఫార్సు చేసింది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ప్రధాన కారణమైన హెచ్‌పీవీ వైరస్ బారిన పడకుండా చిన్న వయస్సులోనే బాలికలకు రక్షణ కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. భవిష్యత్తులో క్యాన్సర్ ముప్పును సమర్థవంతంగా అడ్డుకోవడంలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ఎంతో కీలకమని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు, క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు డబ్ల్యూహెచ్ఓ చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ మార్గదర్శకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

కాగా, భారత్‌లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం గత ఫిబ్రవరి నెలలో ప్రారంభించిన జాతీయ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్ కింద ఇప్పటివరకు 80 లక్షల కంటే ఎక్కువ మంది బాలికలకు వ్యాక్సిన్ డోసులను విజయవంతంగా పంపిణీ చేశారు. ఈ వాక్సినేషన్ కార్యక్రమంలో గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మిజోరాం వంటి రాష్ట్రాలు తమకు కేటాయించిన టార్గెట్ జనాభాలో 100 శాతం కవరేజీని సాధించాయి. ఇక ఆంధ్రప్రదేశ్, బిహార్, అస్సాం రాష్ట్రాలు 90 శాతానికి పైగా కవరేజీని దాటాయి. తెలంగాణ 60 శాతానికి పైగా ప్రగతిని నమోదు చేసిన విషయం తెలిసిందే.

# ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల!



**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. 10 నగర పంచాయతీలు, 77 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లకు ఎన్నికల నోటిఫికేషన్‌ను అధికారులు విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికలకు ఈ నెల 28న పోలింగ్, 30న ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుందని, 19 నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

**ఎంపీటీసీ, జడ్పీటీసీలకు నోటిఫికేషన్**

ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఈ నెల 19న నోటిఫికేషన్ విడుదలకానుందని తెలిపారు. 23న నామినేషన్లకు చివరి తేదీ కాగా.. 24న పరిశీలన, 27న ఉపసంహరణ ఉంటుందని, నవంబర్ 3న ఎన్నికలు, 5న ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

**మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు..**

ఇక పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 26న ఫేజ్–1, 29న ఫేజ్–2, డిసెంబర్ 2న ఫేజ్–3 ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీలకు ఎన్నికలు జరిగిన రోజే ఫలితాలు విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# ఎల్‌నినో వేళ.. వానల జోరు!

**మొదటి పేజీ తరువాయి**

అక్టోబరు 15వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి అక్టోబరు 17వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి ప్రాంతాల్లోనూ అక్కడక్కడ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కూడా వర్షాలు పడవచ్చని అంచనా.

అక్టోబరు 17వ తేదీ ఉదయం నుంచి 18వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు కొన్ని జిల్లాల్లో వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉంది. కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ సహా ఇతర ప్రాంతాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది.

ట్యాంక్‌బండ్‌పై అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలు వద్దు.. యువతకు సీపీ సజ్జనార్ వార్నింగ్

అక్టోబరు 18వ తేదీ నుంచి 20వ తేదీ ఉదయం వరకు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సమయంలో కూడా గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాల వారీగా వర్ష తీవ్రతలో మార్పులు ఉండవచ్చునని, తాజా వాతావరణ హెచ్చరికలను గమనించాలని సూచిస్తున్నారు.

వర్షాల నేపథ్యంలో రైతులు కోతకు వచ్చిన పంటలు, ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. వ్యవసాయ మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యాన్ని అవసరమైన కవర్లతో కప్పి భద్రపరచాలని అంటున్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చేసుకోవాలని.. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడకూడదని అంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఉండేవారు సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచిస్తున్నారు.





# 'ఇందిరమ్మ చీరల' పంపిణీకి సర్వం సిద్ధం



**న్యూస్ డెస్క్, 14 అక్టోబర్ (తెలుగు గళం):** రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇందిరా మహిళా శక్తి ప్రాజెక్టులో భాగంగా మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని రానున్న నవంబర్ 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టింది. కోటిమందికి కోటి చీరలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ బృహత్తర కార్యక్రమానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఈసారి ఆకుపచ్చ రంగు చీర, ఎరుపురంగు అంచుకలిగిన చీరను ప్రభుత్వం ఎంపిక చేసింది. గతంతో పోలిస్తే ఈ చీర చాలా కలర్‌ఫుల్‌గా ఉందంటూ హైదరాబాద్‌లో జరుగుతున్న సరస్ మేళా –2026కు హాజరైన మహిళలు ప్రశంసిస్తున్నారు. అక్కడి స్టాల్స్‌లో ఈ చీరల గురించి ఇతర రాష్ట్రాల టూరిస్టులు అడిగి తెలుసుకోవడం గమనార్హం.

జిల్లాలకు చేరిన 50 లక్షల చీరలు..

రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డు కలిగి, 18 ఏళ్ల పైబడిన ప్రతిఒక్క యువతి, మహిళలకు చీరలు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇదివరకు కేవలం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, అర్హులైన మహిళలకు మాత్రమే అందించిన చీరలు ప్రస్తుతం అందరికీ అందుబాటులోకి రానున్నాయి. సిరిసిల్లతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల చేనేత, పవర్ లూమ్ కార్మికులకు ఉపాధి కల్పిస్తూ నాణ్యమైన వస్త్రంతో ఈ చీరలను రూపొందిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈసారి చీరల నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వం దాదాపుగా రూ. 300 కోట్ల వరకు నిధులను కేటాయించింది. కాగా సిరిసిల్ల తదితర కేంద్రాల నుంచి ఇప్పటికే 50 లక్షలు చీరలు జిల్లా కేంద్రాలకు చేరుకున్నాయి. కలెక్టర్లు, మహిళా సాధికారత శాఖల (సెర్ప్, మెప్మా) ఆధ్వర్యంలో గ్రామ, పట్టణ స్థాయిల్లో చీరలు పంపిణీకి అవసరమైన కేంద్రాలను ఎంపిక చేస్తున్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై తాటికాయల రాజేందర్ గురి!

**ఎస్సీ రిజర్వేషన్‌తో తనకు అవకాశం వస్తుందని ఆశలు..పార్టీ కోసం చేసిన పోరాటాలు, త్యాగాలకు గుర్తింపు ఇవ్వాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరికి విజ్ఞప్తి**

తెలుగు గళం న్యూస్ జాఫర్‌గడ్ అక్టోబర్ 14: స్టేషన్ ఘన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు జాఫర్‌గడ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాటికాయల రాజేందర్ ఆశలు పెట్టుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించడంతో, పార్టీ కోసం తాను చేసిన సేవలను గుర్తించి అవకాశం కల్పించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరుతున్నారు.ఏళ్లుగా పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న తనకు ఈసారి పదవి దక్కుతుందనే విశ్వాసంతో ఉన్నారు.

**కష్టకాలంలోనూ పార్టీని వీడని నేత**

2012 నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నానని రాజేందర్ చెబుతున్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ వెనుకడుగు వేయకుండా పోరాటాలు నిర్వహించానని, ఈ క్రమంలో కేసులు ఎదుర్కొని జైలు జీవితం అనుభవించాల్సి వచ్చిందని గుర్తుచేస్తున్నారు.ఆర్థికంగా నష్టాలు ఎదురైనా పార్టీని వీడకుండా కాంగ్రెస్ సిద్ధాంతాలకే కట్టుబడి ఉన్నానని పేర్కొంటున్నారు.నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, సామాజిక మాధ్యమాల విభాగం ఇన్‌చార్జిగా, మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా వివిధ బాధ్యతలు నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడినట్లు వివరించారు.



**జిల్లా కోసం పోరాటం..కేసులు,జైలు జీవితం**

జాఫర్‌గడ్ మండలాన్ని తిరిగి వరంగల్ జిల్లాలో కలపాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినట్లు రాజేందర్ తెలిపారు. ఈ ఉద్యమంలో భాగంగా తనపై కేసులు నమోదై రెండుసార్లు జైలుకు వెళ్లాల్సి వచ్చిందని, ఇప్పటికీ న్యాయస్థానానికి హాజరవుతున్నానని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపలేదని స్పష్టం చేశారు.2019 ఎంపీటీసీ ఎన్నికల్లో జాఫర్‌గడ్ ఎంపీటీసీ-2 స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజలకు, పార్టీకి అందుబాటులో ఉంటూ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

**ఎన్నికల్లో పార్టీ విజయానికి అండగా..రాజేందర్**

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు జాఫర్‌గడ్ మండలంలో మెజారిటీ సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేసినట్లు రాజేందర్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి తన వంతు సహకారం అందించినట్లు పేర్కొన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నానని చెప్పారు.

**కడియం శ్రీహరి నిర్ణయంపైనే ఆశలు!**

ఎస్సీ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి కేటాయించిన నేపథ్యంలో, పార్టీ కోసం కష్టపడిన తనకు అవకాశం కల్పించాలని రాజేందర్ కోరుతున్నారు.సుదీర్ఘకాలంగా పార్టీకి చేసిన సేవలు, నిర్వహించిన బాధ్యతలు, ప్రతికూల పరిస్థితుల్లోనూ కొనసాగించిన పోరాటాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిగణనలోకి తీసుకుంటారని ఆశిస్తున్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం లభిస్తే రైతుల సమస్యల పరిష్కారానికి, మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పనిచేస్తానని తెలిపారు.పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు పదవుల రూపంలో గుర్తింపు లభించాలనే ఆకాంక్షతో ఉన్న తాటికాయల రాజేందర్‌కు అధిష్ఠానం అవకాశం కల్పిస్తుందా? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకం: హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్

**అనంతసాగర్‌లో 'సంఘమిత్ర' అవగాహన కార్యక్రమం**
**మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళా భద్రతపై ప్రత్యేక అవగాహన**



హసన్‌పర్తి అక్టోబర్ 14 : వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు 'సంఘమిత్ర' (సామాజిక అనుసంధాన కార్యక్రమం)లో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మహేందర్ మాట్లాడుతూ, నేరాలు లేని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు.ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, మహిళా సంఘాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.గ్రామంలో ప్రజల భద్రతను మరింత పెంచేందుకు సామూహిక నిధులతో నిఘా కెమెరాల ఏర్పాటు, వాటి సమర్థ వినియోగంపై దృష్టి సారించాలని కోరారు.సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని తెలిపారు.మహిళలు, బాలల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు బలోపేతం చేయడంతో పాటు మహిళా సంఘాలను శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములుగా చేయడమే సంఘమిత్ర కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.క్షేత్రస్థాయిలో మహిళా స్వయం సహాయక సంఘాలతో సమన్వయం చేసుకుంటూ సురక్షితమైన సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖ కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్, పోలీస్ సిబ్బంది, మండల స్థాయి మహిళా సమాఖ్య ప్రతినిధులు, ఏపీఎం నారాయణ, సీసీ పద్మ, వీవోఏ రజిత, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, కోశాధికారి, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

**బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నెరెళ్ల హైమ పూజిత**

ధర్మసాగర్, అక్టోబర్ 14 (తెలుగు గళం):

బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ధర్మసాగర్ గ్రామపంచాయతీ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నెరెళ్ల హైమ పూజిత పాల్గొని బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల కార్మిక వ్యవస్థకు సంబంధించిన చట్టాలు, పిల్లల విద్యా హక్కులపై గ్రామస్తులకు వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండని బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల వల్ల పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల పిల్లలు విద్యకు దూరమవడంతో పాటు శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని వివరించారు.పిల్లలను బాల కార్మికులుగా పనుల్లో పెట్టకుండా, వారి హక్కులను పరిరక్షిస్తూ విద్యను కొనసాగించేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య అందించాల్సిన బాధ్యత ఉందని, పిల్లలను బడికి దూరం చేయకుండా చదివించాలని కోరారు.ఎవరైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే 1098 బాలల సహాయవాణి నంబరుకు సమాచారం అందించాలని ఆమె సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచే విధంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. బాల్య వివాహాలకు పాల్పడే కుటుంబ సభ్యులతో పాటు వివాహాన్ని నిర్వహించే పురోహితులు, సహకరించే ఇతరులపైనా




చట్టప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు.బాల్య వివాహాలను అరికట్టడం, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, ప్రతి చిన్నారికి విద్య అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామస్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని బాలల హక్కుల పరిరక్షణకు సహకరించాలని ఆమె వివరించారు.ఈ కార్యక్రమంలో ఏం.కవిత,తాసిల్దార్.బావు, సీఐ.ఏ.శ్రీనివాస్,సర్పంచ్ మాచర్ల.జ్యోతి,ఎంపిఓ,అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు

### విద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్ ఆగ్రహం..

## నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ తప్పదు!



తెలుగు గళం: తెలంగాణలో పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు.. అధికారులపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.. విద్యుత్ సరఫరా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఆదేశించినప్పటికీ పరిస్థితిలో ఎందుకు మార్పు రావడం లేదని అధికారులను ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏ ఒక్కరినీ ఉపేక్షించబోనని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని ఎందుకు పెంచడం లేదని సీఎం అధికారులను నిలదీశారు. బొగ్గు కొరత రాకుండా నైనీ, మహానది నుంచి బొగ్గు లింకేజీ ఏర్పాట్లు చేసినప్పటికీ యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో సామర్థ్యానికి అనుగుణంగా ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా విషయంలో సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయో వెంటనే వివరించాలని ఆదేశించారు.

రైతులకు విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యంపై సీరియస్

పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా అధికారులు పట్టించుకోవడం లేదని రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది తానేనని, అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. రైతులకు, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించబోనని తేల్చిచెప్పారు. విద్యుత్ శాఖలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అవసరమైతే స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్‌కో సీఎండీపై కూడా సస్పెన్షన్ చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు గల కారణాలను వెంటనే తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా పరిస్థితిని సమీక్షించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

## బాటిల్ మూత గొంతులో ఇరుక్కొని తొమ్మిది నెలల బాలుడి మృతి



ఊట్కూరు,తెలుగు గళం: మంచినీళ్ల బాటిల్ మూత గొంతులో ఇరుక్కొని తొమ్మిది నెలల చిన్నారి మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని దేవీనగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మణ్, గాయత్రి దంపతులకు ఆర్యవర్ధన్ (9 నెలలు) సంతానం. ఈనెల 12న బాలుడు ఇంట్లో ఆడుకుంటూ వాటర్ బాటిల్‌ను నోట్లో పెట్టుకున్నాడు. ఈ క్రమంలో బాటిల్ మూత గొంతులో ఇరుక్కుపోయి ఇబ్బందులు పడుతుండగా.. కుటుంబ సభ్యులు చేతివేళ్లతో తీశారు.

మూత తీసే క్రమంలో బాలుడి గొంతులో తీవ్ర గాయం కావడంతో మరునాడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే తల్లిదండ్రులు నారాయణపేట జిల్లా ఆసుపత్రికి చికిత్స అందించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు బుధవారం మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

## వరంగల్‌లో ఆపిల్ వ్యాపారికి కుచ్చుటోపీ

**ఫోన్‌పే నకిలీ సందేశాలతో రూ.1.05 లక్షల మోసం!**
**బిర్యానీ కేంద్రాల నిర్వాహకుడిపై ఫిర్యాదు**

తెలుగు గళం న్యూస్ వరంగల్, అక్టోబర్ 14

ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించినట్లు నకిలీ సందేశాలు చూపించి ఆపిల్ వ్యాపారిని మోసం చేసిన ఘటన వరంగల్‌లో వెలుగుచూసింది.సుమారు 20 రోజుల వ్యవధిలో రూ.1,05,000 విలువైన ఆపిల్స్ తీసుకొని నగదు చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు బాధిత వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారు.వివరాల్లోకి వెళితే..వరంగల్‌లోని వాల్‌మార్ట్ ఎదురుగా, అండర్ బ్రిడ్జి సమీపంలో బిర్యానీ కేంద్రాలు నిర్వహిస్తున్న జక్రియ అనే వ్యక్తి గత 20 రోజులుగా తన కేంద్రాల వద్ద పండ్ల వ్యాపారాన్ని కూడా ప్రారంభించాడు. ఈ క్రమంలో వరంగల్ పండ్ల మార్కెట్‌కు వచ్చి వ్యాపారి ఎం.డి. అఫ్జల్ వద్ద నుంచి సుమారు రూ.1.05 లక్షల విలువైన ఆపిల్స్ కొనుగోలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఆపిల్స్ తీసుకున్న ప్రతిసారీ ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించినట్లు నకిలీ సందేశాలను చూపిస్తూ జక్రియ మోసానికి పాల్పడినట్లు బాధితుడు ఆరోపించారు.అనుమానం రావడంతో బ్యాంకు ఖాతా లావాదేవీల వివరాలను పరిశీలించగా, తన ఖాతాలోకి ఎలాంటి నగదు జమ కాలేదని గుర్తించినట్లు తెలిపారు.దీంతో బాధిత వ్యాపారి బుధవారం (అక్టోబర్ 14) పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికానున్నాయి.

## పత్తి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి!

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ మూడ్ శోభన్ వినతి**



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ అక్టోబర్ 14

రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ మూడ్ శోభన్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు.పత్తి దిగుబడులు తగ్గడంతో పాటు, భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల పత్తిని సకాలంలో కొనుగోలు చేసేలా రాష్ట్రవ్యాప్తంగా పత్తి మిల్లుల వద్ద సీసీఐ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరారు.తేమ శాతం పేరుతో రైతుల పత్తిని కొనుగోలు చేయకుండా నిరాకరించవద్దని, నిబంధనలకు అనుగుణంగా కొనుగోళ్లు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతులు తమకు సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించేలా అవకాశం కల్పించాలని సూచించారు. స్లాట్ బుకింగ్, కొనుగోలు కేంద్రాల కేటాయింపు, దూర ప్రాంతాలకు పత్తిని తరలించడం, రవాణా ఖర్చుల భారంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సీసీఐ కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.పత్తి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.పత్తి రైతుల కష్టాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని మూడ్ శోభన్ విజ్ఞప్తి చేశారు.

## జనగామకు విద్యాసంస్థలు మంజూరు చేయాలి

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్, కాకతీయ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**



తెలుగు గళం న్యూస్ జనగామ అక్టోబర్ 14

జనగామ నియోజకవర్గంలో విద్యా, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్, కాకతీయ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయాలని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ ద్వారా ముఖ్యమంత్రికి తన అభ్యర్థనను తెలియజేశారు.జనగామ నియోజకవర్గం విద్యా, ఉపాధి అవకాశాల పరంగా వెనుకబడిన ప్రాంతంగా ఉందని, ఉన్నత విద్య, మెరుగైన ఉద్యోగ అవకాశాల కోసం విద్యార్థులు, యువత ఇతర నగరాలకు వలస వెళ్లాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు.స్థానికంగా నాణ్యమైన విద్యాసంస్థలు అందుబాటులోకి వస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 20 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో జనగామ నియోజకవర్గానికి చోటు లభించకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.జనగామలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్‌తో పాటు తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంజూరు చేయాలని కోరారు.అలాగే, నియోజకవర్గంలో సాంకేతిక విద్యను అభివృద్ధి చేసేందుకు కాకతీయ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉన్న కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యాలయాలను కూడా జనగామకు త్వరితగతిన మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.జనగామ ప్రాంతంలో విద్యకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి, నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలని, స్థానిక యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం తీసుకోవాలని బిర్రు ఇస్తారి విద్యార్థుల తరఫున హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

## గుర్తుతెలియని మృతదేహం కలకలం!

**-శంకరాజుపల్లి సమీపంలో మృతదేహం గుర్తింపు..**
**పోలీసులకు సమాచారం**
**- దుర్వాసనతో వెలుగులోకి వచ్చిన ఘటన..**
**- తుపాకులగూడెం రోడ్డుపక్కన మృతదేహం**



తెలుగు గళం ఏటూరునాగారం, అక్టోబర్ 14:

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి శివారులోని తుపాకులగూడెం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి పక్కన తిరుగురాళ్ల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవడం స్థానికంగా కలకలం రేపింది. బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన కొందరికి రహదారి పక్కన ఉన్న పొదల ప్రాంతం నుంచి దుర్వాసన రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ క్రమంలో మృతదేహాన్ని గుర్తించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఏటూరునాగారం ఎస్ఐ బి. మహేష్‌కు విషయం తెలియజేయగా, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించే అవకాశం ఉంది. మృతుడి వివరాలు, మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. మృతుడి ఆచూకీ, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసుల దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది.

## భూ ఆక్రమణ, నిర్బంధం కేసులో నిందితులకు శిక్ష




సత్తుపల్లి, అక్టోబర్ 14 (తెలుగుగళం) న్యూస్: వేంసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన భూ ఆక్రమణ నిర్బంధం కేసులో లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన నరసింహారావు, రాంబాబుకు సత్తుపల్లి న్యాయస్థానం శిక్ష విధించింది. నరసింహారావుకు 45 రోజుల సాధారణ జైలు శిక్ష, రాంబాబుకు 45 రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు ఇద్దరికీ ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బి.ఎస్.ఎన్. సుమబాల బుధవారం తీర్పు వెలువరించారు. భారతీయ శిక్షాస్మృతిలోని 447, 341 సెక్షన్ల కింద ఈ శిక్షలు విధించారు. కేసులో ప్రభుత్వ సహాయ న్యాయవాది జె. భద్రయ్య వాదనలు వినిపించారు.

## కురవి వీరభద్ర స్వామిని దర్శించుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

- భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి రాష్ట్ర బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

డోర్నకల్ నియోజకవర్గం, కురవి మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రకాళి సమేత శ్రీవీరభద్ర స్వామివారిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ రాష్ట్ర బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు, అనంతరం ఏర్పాటు చేసిన బతుకమ్మ



వేడుకలలో పాల్గొన్నారు, బతుకమ్మని ఎత్తుకొని ఉయ్యాల పాటలతో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు,ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి,మాజీ ఎంపీ మాలోత్ కవిత,మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్,మాజీ జడ్పీ చైర్‌పర్సన్లు తుల ఉమ,కుమారి బిందు అంగోత్,మంత్రి శ్రీదేవి,కురవి సర్పంచ్ లక్ష్మీ రాజు నాయక్,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు తోట లాలయ్య,పిచ్చి రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ పెద్ది వెంకన్న గౌడ్,ఐలి నరహరి గౌడ్,బొడ శ్రీను నాయక్,గుగులోత్ నెహ్రూ నాయక్,సంగేమ్ భరత్,భద్రు,భోజ్య నాయక్,బాణోత్ శారద,అంగోత్ కాంతి తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేకల శివ గౌడ్ నియామకం



తెలుగు గళం న్యూస్ చిట్యాల/అక్టోబర్ 14

తెలంగాణ గౌడ యువజన సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిట్యాల పట్టణానికి చెందిన మేకల శివ గౌడ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు గట్టు నరేష్ గౌడ్ ఆయనకు నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మేకల శివ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు,రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.కల్లు గీత కార్మికుల సంక్షేమం,గౌడ జాతి అభివృద్ధి, గౌడన్నల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, గౌడ జాతి ఆత్మగౌరవం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి, గౌడ యువతను సంఘటితం చేయడానికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.

## స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో రాచేపల్లి మనోజ్ ప్రతిభ జాతీయ స్థాయికి ఎంపిక

తెలుగుగళం న్యూస్, పామిడి.




ఇటీవల నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో పామిడి నందుగల శ్రీ సత్య బ్రూస్ లీ తైక్వాండో అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న రాచేపల్లి మనోజ్ అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తాడిపత్రి నందు గల శ్రీవాణి హైస్కూల్‌లో జరిగిన ఈ అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో అండర్-14 బాయ్స్ 21 కేజీల విభాగంలో అద్భుత విజయం సాధించి ఈ ఘనతను సొంతం చేసుకున్నాడు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైన మనోజ్‌ను మరియు తైక్వాండో మాస్టర్ తలారి తులసి రామ్ ను తాడిపత్రి మండల విద్యాశాఖాధికారి నాగరాజు అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ సత్యనారాయణ మరియు కోచ్‌లు ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే జాతీయ స్థాయి పోటీల్లోనూ మనోజ్ మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## బదిలీపై వెళ్తున్న ఎస్సైకి ఘన సన్మానం

తెలుగు గళం న్యూస్
పర్వతగిరి/అక్టోబర్ 14



వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలంలో 33 గ్రామాలకు సేవలందిస్తూ రెండున్నర సంవత్సరాలు ప్రజలకు విశేష సేవలు అందించిన పోలీస్ ఉపనిరీక్షకుడు భోగం ప్రవీణ్ కుమార్ ను అన్నారం గ్రామ సర్పంచ్ గాడి పెల్లి మహేందర్ నేతృత్వంలో కలిసి శాలువాతో సన్మానించారు.బదిలీపై వెళు న్న నేపథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొడుగు ఏకాంత సారయ్య, రాపోలు అనిత రవీందర్, భాష, బోయిన రామకృష్ణ, ముంజంపల్లి నాగరాజు, కొండేటి కొమరమ్మ, రామచందర్, దొంత మాల పవన్ కళ్యాణ్, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, గ్రామపంచాయతీ కార్యదర్శి నిర్మల రాజు తదితరులు పాల్గొన్నారు.

## తానంచెర్ల సబ్‌స్టేషన్‌లో అదనపు 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.



మండలంలోని తానంచెర్ల విద్యుత్ ఉపకేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్, అదనపు విద్యుత్ లోడ్ సమస్యల పరిష్కారానికి అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఎస్‌ఈ ఆపరేషన్స్ మహబూబాబాద్ కే. దర్శన్ కుమార్ ఆధ్వర్యంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు విద్యుత్ శాఖ డీఈ కృష్ణ, ఏడీఈ శ్రీనివాసరావు, ఏఈలు లోక్‌నాథ్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## జమాల్ పురం లో కొత్త ట్రాన్స్ఫార్మర్ ప్రారంభం

తెలుగు గళం న్యూస్
పర్వతగిరి/అక్టోబర్ 14



వరంగల్ జిల్లా: పర్వతగిరి మండలం జమాల్పురం సోమారం రైతుల చిరకాల సమస్యకు పరిష్కారం లభించింది. జమాల్పురం కుంబోడు వద్ద నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభోత్సవం జరిగింది.ప్రారంభకులుగా జమాల్పురం సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్, విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ పాల్గొన్నారు.ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు తన స్థలాన్ని దానంగా ఇచ్చిన కుమ్మజెల్ల రాంబాబును సర్పంచ్, లైన్మెన్ ప్రత్యేకంగా అభినందించారు. రైతుల కోసం తన పొలంలో స్థలం ఇవ్వడం ఆదర్శనీయమన్నారు. ట్రాన్స్ఫార్మర్ మంజూరు నుండి ఏర్పాటు వరకు కృషి చేసిన లైన్మెన్ శోభన్ కుమార్, మట్టపల్లి అమృతరావును సర్పంచ్ అభినందించారు. వారి నిరంతర ఫాలోఅప్ వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. నిర్మాణంలో గోరేమియా, సందాని, సర్దార్, గౌస్ పాషా, రాము, మధుకర్ మరియు కాంట్రాక్టు కార్మికులుపాల్గొన్నారు. ప్రారంభోత్సవంలో వేమునూరి సదానందం, యాకాచారి,సంపత్,హరీష్,కిషన్, రవి తదితరులు,పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ ట్రాన్స్ఫార్మర్ తో జమాల్పురంలో 15-20 ఎకరాలు, సోమారంలో 60-70 ఎకరాల వరి పంటకు విద్యుత్ అందుతుంది. తక్కువ వోల్టేజ్ సమస్య తీరినందుకు శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, ప్రభుత్వానికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## రేగొండ మండల పరిషత్‌లో ఘనంగా ఉద్యోగుల బతుకమ్మ వేడుకలు

తెలుగు గళం న్యూస్
భూపాలపల్లి రేగొండ



తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలను రేగొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద మహిళా పంచాయతీ కార్యదర్శులు,వివిధ శాఖల మహిళా ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు.రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి,గౌరమ్మను ప్రతిష్ఠించి కార్యాలయ ప్రాంగణానికి తీసుకువచ్చారు.ఈ వేడుకలకు రేగొండ సర్పంచ్ వారణాసి మౌనిక ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు.సంప్రదాయ పాటలు పాడుతూ,కోలాటాలు ఆడుతూ మహిళలు ఉత్సాహంగా గడిపారు.ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. సంస్కృతిని కాపాడుతూ వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించిన మహిళా ఉద్యోగులను అభినందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జీవిత, ఉదయశ్రీ, పద్మ, అమూల్య, జ్యోతి, నవ్య , సుజాత, సునీత, స్రవంతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## దాడి కేసులో నిందితులకు రెండేళ్ల జైలు శిక్ష




సత్తుపల్లి, అక్టోబర్ 14 (తెలుగుగళం) న్యూస్: వేంసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దాడి కేసులో ఇద్దరు నిందితులకు సత్తుపల్లి న్యాయస్థానం రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించింది. కందుకూరు గ్రామానికి చెందిన అప్పారావు,భాగ్యలక్ష్మిపై నమోదైన కేసులో న్యాయమూర్తి బి.ఎస్.ఎన్. సుమబాల బుధవారం ఈ తీర్పు వెలువరించారు. భారతీయ శిక్షాస్మృతిలోని 324, 326 సెక్షన్ల కింద ఈ శిక్ష విధించారు. కేసులో ప్రభుత్వ సహాయ న్యాయవాది జె. భద్రయ్య వాదనలు వినిపించారు.

## గోపనపల్లిలో అనిల్ రావుకు సన్మానం



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి /అక్టోబర్ 14

పర్వతగిరి సొసైటీ చైర్మన్ గా ఎంపికైన పిన్నింటి అనిల్ రావుకు గోపనపల్లి గ్రామంలో శాలువాతో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జన్ను నరసయ్య, సర్పంచ్ నాంపల్లి విజయ అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, చౌటపల్లి సొసైటీ డైరెక్టర్ బెల్లం కుమారస్వామి, నాయకులు ఆకుల సతీష్, గొల్లపల్లి శ్రీధర్, గొల్లపల్లి తిరుపతి, బాధ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

## భూమి కోసం పోరాటం..

## ప్రాణహాని బెదిరింపులు!

**బీజేపీ నేతపై బాధిత కుటుంబం తీవ్ర ఆరోపణలు**




ధర్మసాగర్, అక్టోబర్ 14 (తెలుగు గళం):

ధర్మసాగర్ గ్రామకంఠంలోని భూమి వివాదంలో తమను వేధిస్తూ, ప్రాణహాని బెదిరింపులకు పాల్పడుతున్నారని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్ రెడ్డి, ఆయన సోదరుడు రాజగోపాల్ రెడ్డిపై ముక్క దామోదర్ వారసులు రాఘవులు, రమేష్, శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సర్వే నంబర్లు 1069, 1069ఈ పరిధిలో 2016లో 440 గజాలు, 2022లో 141 గజాల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. మొత్తం 625 గజాల భూమికి సంబంధించి వివాదం కొనసాగుతోందన్నారు.తాము కొనుగోలు చేసిన భూమిని ఆక్రమించుకునేందుకు జేసీబీలతో చదును చేస్తూ, అక్కడికి వస్తే లారీలతో తొక్కించి చంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విలేకరుల సమావేశాల్లో పాల్గొంటే అక్రమ కేసులు పెట్టిస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.సంబంధిత అధికారులు భూమి వివాదంపై సమగ్ర విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను కోరారు. ఈ సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## పాలపాటి సాంబయ్య కుటుంబానికి సీపీఎం ఎల్లవేళలా అండ"

**పరామర్శించిన సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు"**



సత్తుపల్లి/తల్లాడ, అక్టోబర్14(తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ సభ్యుడు పాలపాటి సాంబయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న సీపీఎం పార్టీ జిల్లా నాయకత్వం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించింది. సాంబయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ, పాలపాటి సాంబయ్య కుటుంబానికి సీపీఎం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. కుటుంబ సభ్యులకు ఏ అవసరం వచ్చినా పార్టీ అందుబాటులో ఉంటుందని, కష్టకాలంలో వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే సీపీఎం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.సాంబయ్య కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, మాచర్ల భారతి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, సాయిని ప్రకాష్‌రావు, అనుమాలు రమేష్, అనుమోలు కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బత్తిని ఎల్ల గౌడ్ జన్మదిన వేడుకలు

ధర్మసాగర్, అక్టోబర్ 14 (తెలుగు గళం):



ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బత్తిని ఎల్ల గౌడ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన స్వగృహంలో స్నేహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులు, బంధువులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.మంచితనానికి మారుపేరుగా,అందరితో ఆప్యాయంగా కలిసిమెలిసి ఉండే ఎల్ల గౌడ్ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు.కులమతాలకు అతీతంగా సేవాభావంతో ప్రజలకు అండగా నిలుస్తూ, సమాజ శ్రేయస్సు కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రేయోభిలాషులు కోరుకున్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.